


నేడు కలెక్టరేట్‌లో
ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

ఈ నెల 8న సోమవారం తిరుపతి కలెక్టరేట్‌లో మీకోసం- ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు మీకోసం - ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అలాగే డివిజన్, మండల కార్యాలయాల్లో తహశీల్దార్, ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాలలో సంబంధిత అధికారులు విధిగా పాల్గొనాలని తెలిపారు.

అత్యంత కష్టం..!

- ప్రభుత్వ వసతి గృహంలో నీటి కరువు
- మరుగుదొడ్లకు, స్నానాలకూ విద్యార్థుల పరుగులు
- దుస్థితి పట్టని అధికారులు

కుటుంబ పోషణ భారంతో కొంతమంది.. ఆర్థిక స్థితి గతులతో మరికొంత మంది ఇంటి వద్ద ఉంటే తోటి విద్యార్థులతో కలిసి చదువుకు దూరం అవుతారన్న భయంతో, పరిస్థితులు అన్నీ బాగున్నా తమ పిల్లలు బాగుపడితే చాలని మరి కొంతమంది తమ పిల్లలను కష్టమైన వసతి గృహాల్లో చేర్పించి చదివించుకుంటున్నారు. కానీ వసతి గృహాల్లో ఏర్పడిన సమస్యలతో విద్యార్థులకు వసతులు లభించడం అత్యంత కష్టంగా మారుతున్నాయి.. నీటి కరువు కారణంగా వసతి గృహ విద్యార్థులు మరగుదొడ్లకు, స్నానాలకూ పరుగులు తీస్తున్నారు. ఈ దుస్థితి అధికారులకు ఏ మాత్రం పట్టడంలేదు. ఈ కారణంగా విద్యార్థుల గోడు వర్ణనాతీతంగా మారింది.

ప్రజాశక్తి- పూతలపట్టు:

పూతలపట్టు మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో గత నాలుగు రోజులుగా నీటి ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో విద్యార్థులు మరుగుదొడ్లు, స్నానాలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అర్ధరాత్రి పూట మరుగుదొడ్లకు వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని విద్యార్థులు వాపో తున్నారు. ఆరు బయటకు వెళ్లాలంటే రాత్రి సమయాల్లో విష పురుగుల బెడద వేధిస్తోందని, ఈ కారణంగా వెళ్లలేక అవస్థలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలే దిక్కు

నీటి ఇబ్బందుల కారణంగా వసతి గృహం పక్కనే ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలే దిక్కుగా మారిందని విద్యార్థులు అంటున్నారు. పాఠశాల ఆవరణలోని వంట గది వద్ద ఏర్పాటు చేసిన కుళాయిల వద్ద స్నానాలు చేస్తున్నామని, మరుగుదొడ్లకు వెళ్లాలంటే పాఠశాల క్రీడా మైదానంలోని మరుగుదొడ్ల గోడలను ఎక్కి దూకాల్సిందేనని పిల్లలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగు రోజులుగా స్నానాలు చేయాలంటే కుళాయిల వద్ద పోటీ పడి కుస్తీ పడాల్సి వస్తోందని వాపోతున్నారు. అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకుని నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

వెంటనే చర్యలు తీసుకుంటాం..

వసతి గృహానికి వచ్చే తాగునీటి పైపు మరమ్మతులకు గురి కావడంతో ఈ సమస్య నెలకొంది. ఇప్పటికే సంబంధిత అధికారులతో చర్చించాం. అధికారులు వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తాత్కాలిక పరిష్కారం కోసం వసతి గృహంలోని నీటి ట్యాంకుకు మోటారు అమర్చి నీటి సరఫరా అందిస్తాం.

- జయచంద్రారెడ్డి , వసతి గృహం వార్డెన్.





కంపు..కంపు!

ఎంపీడీవో కార్యాలయంలో కానరాని పారిశుద్ధ్యం

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: మండల ఎంపీడీవో కార్యాలయంలో పారిశుధ్యం పూర్తిగా లోపించింది. అడుగు పెట్టిన వెంటనే దుర్వాసన వస్తోంది. ఎంపిడిఓ కార్యాలయంలో ఉన్న మరుగుదొడ్డి, బాత్ రూం చాలా కాలంగా పరి శుభ్రతకు నోచుకోవడంలేదు. దీంతో మరుగుదొడ్డి నుంచి దుర్వాసన వస్తోంది. అసలు మరుగుదొడ్డిని చూస్తుంటే అటువైపు అధికారులు వెళ్లిన దాఖలాలు కనిపించడంలేదు. అంతే కాకుండా మరుగుదొడ్లకు ఏర్పాటు చేసిన కుళాయి మరమ్మతుకు గురి కావడంతో లక్షల లీటర్లు వృథా అవుతోంది. దీన్ని అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదని కార్యాలయానికి వచ్చే ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు.

బహిర్గత ప్రదేశాల్లో మూత్ర విసర్జన

మండల కార్యాలయంలో మరుగుదొడ్డి అధ్వానంగా ఉండటంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు కార్యాలయం వెనుక ఉన్న బహిరంగ ప్రదేశాలలో మూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో కార్యాలయం లోపల, బయట వాసన భరించలేకపోతున్నామని ప్రజలు వాపోతున్నారు. అంతే కాకుండా అధికారులు సైతం చాలా మంది కార్యాలయం వెనుక వెళ్లి మూత్ర విసర్జన చేస్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. అపరిశుభ్రత నెలకొంటున్నా ఎంపీడీవో స్పందించక పోవడం బాధాకరమని ప్రజలు వాపోతున్నారు.

ప్రజలకు ఏ సందేశం ఇస్తున్నారు?

అధికారులు ప్రజల్లోకి వెళ్లి పారిశుధ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారని ప్రజలు చెబుతున్నా అధికారులు మాత్రం వాటిని పాటించడం లేదు. అంతే కాకుండా తన కార్యాలయంలో పారిశుధ్యం పరిరక్షించలేని అధికారులు గ్రామాలలో పారిశు ధ్యం ఎలా పరిరక్షిస్తారు?' అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఎన్నో సార్లు అధికారులకు చెప్పినా ఏమి పట్టించుకోవడం లేదని నిధులు దుర్వినియోగం చేస్తున్నారని మండల ప్రజలు వాపోతున్నారు.

పారిశుధ్యం నిధులు ఏమయ్యాయి?

పారిశుధ్యం కోసం లక్షల రూపాయలు వెచ్చిస్తున్నారు. అధికారులు వాటిని ఏమాత్రం వినియోగించడంలేదు. పారిశుధ్యానికి వచ్చే లక్షల నిధులను అధికారులు సైతం దోచేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలం నుంచి గ్రామ స్థాయి వరకు ఎక్కడా పారిశుధ్య పనులు ముందుకు సాగడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. నామమాత్రంగా నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు పారిశుధ్యంపై దృష్టి సారించి నిధులపై సర్వే చేయాలని విచారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అధికారులను మోసగించే ప్రయత్నం

మండల కార్యాలయంలో పనిచేస్తున్న చాలా మంది పంచాయతీ కార్యదర్శులు స్థానికంగా పక్క మండలానికి చెందిన వారే.. వీరు కార్యాలయ సమయాన్ని పాటించకుండా మధ్యాహ్నం రెండు గంటల పైన కార్యాలయంలో దర్శనమిస్తున్నారు. అత్యవసర పరిస్థితిలో ఎవరైనా ఫోన్ చేస్తే 'మేము అక్కడ ఉన్నాం.. ఇక్కడ ఉన్నాం.. అక్కడికి రండి.. ఇక్కడికి రండి..' అని ప్రజలను మెప్పిస్తున్నారు. ఒకరు సచివాలయంలో ఉంటున్నామని, మరొక ఎంపీడీవో కార్యాలయంలో ఉంటున్నామని అధికారులను మోసగిస్తూ ఇంట్లోనే మకాంచేస్తూ తమ సొంత పనులు చేసుకుంటున్నారనే విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి పంచాయతీ కార్యదర్శులు సరైన సమయానికి కార్యాలయానికి వచ్చి ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



అపరిశుభ్రంగా వున్న మరుగుదొడ్లు



ఘనంగా వీనస్ స్కాన్స్ ప్రారంభం



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతిలో నూతనంగా ఏర్పాటు చేసిన వీనస్ స్కాన్స్‌ను తిరుపతి ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథి, సాయిసుధా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత్రి డాక్టర్ సుధారాణి ప్రారంభించారు. స్థానిక రెడ్డిరెడ్డి కాలనీలోని వీనస్ స్కాన్స్ సెంటర్ వద్దకు చేరుకున్న వారికి నిర్వాహకులు పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు డాక్టర్ సందీప్, డాక్టర్ శివతేజ మాట్లాడుతూ తమ వద్ద అత్యాధునిక సాంకేతికతో కూడిన పరికరాలతో నాణ్యమైన స్కానింగ్ అందించబడతాయన్నారు. రోగులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సూర్య ప్రకాష్, పలువురు ప్రముఖ వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీ జూ పార్కులో పులి మృతి

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం):



మృతి చెందిన జూలీ (ఫైల్)

శ్రీ వెంకటేశ్వర జంతు ప్రదర్శనశాలలో జూలీ అనే ఆడపులి అనారోగ్య కారణాలతో మృతి చెందినట్లు జూక్యూరేటర్ సెల్వం ఆదివారం ఓ ప్రకటనలు తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో ఉత్తరప్రదేశ్ లక్నోలోని నవాబ్ మజీద్ అలీషా జూలాజికల్ పార్క్ నుండి ఈ ఐదేళ్ల జూలిని అనిమల్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం ద్వారా తీసుకురావడం జరిగిందన్నారు. జూన్ మొదటి వారంలో డేక్రాల్ లో భాగంగా ఆడుకుంటూ జూలీ కింద పడడంతో ఎడమ కాలు వెనుక వైపున గాయమైందని, వెటర్నరీ డాక్టర్లు జూలిని పరీక్షించి ఎడమ కాలు వెనుక భాగం, పొత్తికడుపు కింది భాగంలో వెంట్రల్ పార్ట్ ఆఫ్ అబ్ డామిన్‌లో గాయమైనట్లు గుర్తించారన్నారు. ఆరోజు నుండి సరిగా ఆహారం తీసుకోకపోవడం, నీరు తాగకపోవడం వలన పులి ఆరోగ్యం క్షీణించిందని తెలిపారు. జూ హెల్త్ కమిటీ మెంబర్స్, హైదరాబాద్ నెహ్రూ జూలాజికల్ పార్క్ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ నవీన్ సమక్షంలో తిరిగి జూలికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించామన్నారు. స్టీఫిల్ జాయింట్ డిష్ లొకేషన్ అండ్ ఫ్రాక్చర్ జరిగినట్టు గుర్తించామన్నారు. గత 20 రోజులుగా ఆహారం తీసుకోకుండా వైద్యానికి సహకరించకపోవడంతో ఆదివారం 11.30గంటల ప్రాంతంలో మృతి చెందిందని అన్నారు. జూలీ మృతదేహానికి ఎస్వి వెటర్నరీ యూనివర్సిటీ పేథాలజీ బృందం పోస్టుమార్టం నిర్వహించారన్నారు.

మంత్రిని కలిసిన మునికృష్ణ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఆదివారం ఆయన నివాసం వద్ద కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ కలవడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రికి తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ తల్లి విశిష్టత గురించి వివరించి తిరుపతి పర్యటనకు విచ్చేసినప్పుడు గంగమ్మ గుడి దర్శించాలని కోరారు. ఆయన వెంట శ్రీధర్, జగన్నాథం, మణి నాయుడు, రవితేజ నాయుడు, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.



పుంగనూరులో
ఇండోర్ స్టేడియం నేలమట్టం

- 30 ఏళ్లుగా ఉన్న స్టేడియం
- ప్రతీకార చర్యలా..
- అక్రమ కట్టడాలా..?
- రూ.80లక్షలు ఆస్తినష్టం



ప్రజాశక్తి- పుంగనూరు

పుంగనూరు పట్టణంలో ఏళ్ళ తరబడి ఉన్న ఇండోర్ స్టేడియంను శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 2 హిటాచీలతో నేలమట్టం చేశారు. ఎంపీటీ రోడ్డు జాతీయ రహదారి పక్కలో ఉన్న ఇండోర్ స్టేడియం గత 30ఏళ్లగా పట్టణంలో ఉన్న అన్నివర్గాల వారు ఉపయోగించుకుంటున్నారు. ఈ ఇండోర్ స్టేడియంలో షటిల్, స్నూకర్స్, క్యారమ్స్, చెస్ లాంటి క్రీడలకు ఉపయోగించుకోవడం జరుగుతుంది. ఉన్నఫలంగా ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా షటిల్ కోర్టును నేలమట్టం చేయడంతో పట్టణంలో ఈ వార్త దావనంలో అల్లుకున్నది. ప్రతీకార చర్యలో భాగంగా జరిగిందా! లేక అక్రమ కట్టడాలని ప్రభుత్వ అధికారులు ఏమైనా కూలదోసారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అర్ధరాత్రిలో జరిగిన ఈ విధ్వంసకర సంఘటనను పట్టణ ప్రజలు, క్రీడాకారులు ముక్తకంఠంతో ఖండిస్తున్నారు. సుమారు ఈ ఇండోర్ స్టేడియంలో150 మంది దాకా షిఫ్ట్ పద్ధతిలో షటిల్ ఆడేవారు. వయస్సుతో పరిమితి లేకుండా చిన్నపిల్లల నుండి పెద్దల వరకు షటిల్ ఆడుకోవడం జరిగేది. డీకేటి స్థలంలో 30 ఏళ్ల క్రితం 7 గుంటలు జాగాలో (7623 చదరపు అడుగులు) అప్పటి ప్రభుత్వ అధికారులు అనుమతితో షటిల్ కోర్టుగా ఏర్పాటు చేసుకుని ఆటలకు ఉపయోగించుకునేవారు. అప్పటినుండి దినదినాభివద్ధి లాగా సుమారు రూ.80లక్షలు ఖర్చుచేసి ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేసుకున్నారు. పిల్లలకు ఈ పోటీల పైన ఉచిత శిక్షణ కూడా ఇండోర్ స్టేడియంలో నిర్వహించేవారు. షటిల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అని ఏర్పాటు చేసుకొని దీని ద్వారా కార్యక్రమాలు నిర్వహించేవారు. పార్టీలకతీతంగా షటిల్ కోర్టులో షటిల్ కాక్ గేమ్‌లు ఆడేవారు. పోలీసు, వైద్యులు, న్యాయవాదులు, ప్రభుత్వ ఉద్యోగులు ఉదయం సాయంత్రం వేళల్లో ఈ షటిల్ కోర్టుకు వెళ్లేవారు. ఇండోర్ స్టేడియం నేలమట్టం చేయడంతో పలు రకాలుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ పరంగాఏమైనా చేశారా, లేక షటిల్ కోర్టు ఉన్న స్థలం డీకేటీ కావడంతో దాని వెనుక వైపు ఉన్న స్థల యజమాని ఏమైనా చేశారా అని పలువురు పలు రకాల అనుమానాలు వ్యక్తపరుస్తున్నారు. ఈ సంఘటనపై ఫ్రెండ్స్ సెటిల్ అసోసియేషన్ అధ్యక్షులు, ప్రముఖ దంత వైద్యనిపుణులు డాక్టర్ శరన్ కుమార్పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఏది ఏమైనా పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

విధ్వంసం దారుణం : డాక్టర్ చరణ్ కుమార్

ఎన్నో ఏళ్లుగా ఉన్న ఇండోర్ స్టేడియం నేలమట్టం చేయడం దారుణమైన సంఘటనని ఫ్రెండ్స్ సెటిల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ చరణ్ కుమార్ అన్నారు. రాజకీయాలు అతీతంగా ఇండోర్ స్టేడియంలోకి అన్ని పార్టీలకు చెందిన వారు రావడం జరుగుతుందన్నారు. అలాంటిది ఇలాంటి విధ్వంసం సష్టించడం మంచి పద్ధతులు కాదన్నారు. సుమారు రూ.80 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

సమగ్ర విచారణ చేపట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

పుంగనూరులో సంవత్సరాల తరబడి ఉన్న ఇండోర్ స్టేడియంను శనివారం అర్ధరాత్రి నేలమట్టం చేయడం దారుణం. నేలమట్టం చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలి. ఈ సంఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలి. ప్రజాఉపయోగకరంగా ఉన్న స్టేడియంను కూల్చివేయడం హేయమైన చర్య. రెండు వాహనాలు పెట్టి ధ్వంసం చేస్తుంటే అధికారులు కానీ పోలీసులు కానీ ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. పిల్లల దగ్గర నుంచి పెద్దల వరకు అన్ని రకాల ఆటలు ఆడుతున్న స్టేడియాన్ని కూల్చడం సిగ్గు చేటు.



అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి

- నూతన ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి
- ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు కోసం 10న రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు
- యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్:

కేంద్రంలో ఎన్‌డిఏ, రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వాలు అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.సుబ్బారావమ్మ డిమాండ్ చేశారు. తిరుపతి నగరంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం 42 రోజులపాటు వీరోచిత పోరాటాన్ని నిర్వహించామని, ఆ సందర్భంగా ప్రభుత్వంతో కొన్ని ఒప్పందాలు చేసుకున్నామని గుర్తు చేశారు. ఆ పోరాటానికి ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మొదలు తెలుగుదేశం పార్టీ సాధారణ కార్యకర్తల వరకు తమ శిబిరాల వద్దకు వచ్చి మద్దతు ప్రకటించారని, తాము అధికారంలోకి వస్తే వేతనాలు పెంచుతామని, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. చంద్రబాబు నాయుడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు కావస్తున్న నేపథ్యంలో అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తాము కోరుతున్నట్టు ఆమె తెలిపారు. ఇప్పటికే అంగన్వాడీల సమస్యల పరిష్కారంకు సంబంధిత మంత్రికి వినతి పత్రం సమర్పించినట్టు ఆమె తెలిపారు. ఎఫ్ఆర్ఎస్ యాప్ పేరుతో అంగన్వాడీలను వేధింపులు గురిచేయటం సరైంది కాదని ఇప్పటికే యాప్‌ల భారంతో అల్లాడిపోతున్న అంగన్వాడీలకు యాప్‌ల భారం నుంచి మినహాయించాలని పలుమార్లు కోరామని తెలిపారు. ఇప్పుడు నూతనంగా ఎఫ్ఆర్ఎస్ పేరుతో పేస్ రికగ్నిషన్ యాప్‌ను ప్రవేశ పెట్టడం సమంజసం కాదని తక్షణం దీనిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గత ఏడాది ఐసిడిఎస్‌కు రూ.300 కోట్లను నిధుల నుంచి కేంద్రం కోత కోసిందని ఈ ధోరణి ఇలానే కొనసాగితే ఐసిడిఎస్ బలహీనపడుతుందని గుర్తు చేశారు. ఐసిడిఎస్ బలోపేతానికి కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం రూ.50వేల కోట్ల రూపాయల నిధులను కేటాయించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. 23వ తేదీన ప్రవేశపెట్టే కేంద్ర బడ్జెట్‌లో అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తున్నట్లుగా ప్రకటించాలని తగినంత నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం కూడా 2019 నుంచి ఇలాంటి చర్యలకు ఒడిగట్టే ప్రజలలో అభాసు పాలైన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వమైనా పారదర్శకంగా వ్యవహరించాలని, కుట్రపూరిత విధానాలు అనుసరించడం వల్ల ప్రజల్లో పలుచన అవుతారని హెచ్చరించారు. అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చంద్రబాబు ప్రభుత్వం చొరవ చేయాలని, వేతనాలు పెంచాలని రాష్ట్రంలోని లక్ష మంది అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఒప్పందం మేరకు జూలై నెల నుంచి వేతనాలు పెంచాల్సి ఉండగా, వైసీపీ ప్రభుత్వం లోని అధికారులు తమతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా జీవోలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అంగన్వాడీ లాంటి చిరుద్యోగుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, తగినంత వేతనాలు పెంచాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వాణిశ్రీ, అధ్యక్షురాలు పద్మలీలలు మాట్లాడుతూ అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ జిల్లాలోని 34 మండలాల్లో అంగన్వాడీలు ఈనెల 10వ తేదీన ధర్నా కార్యక్రమాలు జయప్రదంగా నిర్వహించాలని, ధర్నాలలో జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల నుంచి సిబ్బంది పాల్గొనాలని కోరారు. తిరుపతి జిల్లాలోని వివిధ ప్రాజెక్టులకు చెందిన అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.



ప్రత్యేక టీమ్‌లతో దర్యాప్తు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:

అత్యాధునిక సాంకేతికతతో కూడిన ప్రత్యేక టీమ్‌లతో దర్యాప్తు చేపట్టామని త్వరలో ఏటీఎం నిందితులను పట్టుకుంటామని ఎస్‌పి మణికంఠ చందోలు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 3.30 గంటలకు గుడిపాల మండలంలో చోటు చేసుకున్న ఏటీఎం చోరీ ఘటనపై ఎస్‌పి మణికంఠ చందోలు సంఘటన స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. సంఘటన స్థలంలో సీసీటీవీ ఫుటేజీలు, ఏటీఎం బ్రేకింగ్, అలారం, సెన్సార్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఈ సంఘటనకు సంబంధించి పూర్తి దర్యాప్తు నిర్వహిస్తామని తెలిపారు. చోరీకి పాల్పడిన వారిని త్వరగా పట్టుకునేందుకు సాంకేతికతతో కూడిన ప్రత్యేక టీములను ఏర్పాటు చేసి, దర్యాప్తు చర్యలు చేపట్టి నట్లు ఎస్పీ వివరించారు. చోరీ జరిగిన విధానం, సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దొంగల ఆచూకీ కనుగొనేందుకు, చోరీకి సంబంధించిన అన్ని కోణాలను పరిశీలించేందుకు పోలీస్ సిబ్బంది కృషి చేస్తున్నారన్నారు. దర్యాప్తులో ఎలాంటి అపోహలు లేకుండా, నిర్దిష్ట ఆధారాలు సేకరించి దోషులను శిక్షిం చేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. బ్యాంకు, ఏటీఎం సెక్యూరిటీ వ్యవస్థను మరింత మెరుగుపరచాల్సిన అవసరాన్ని ఎస్పీ ప్రస్తావించారు. ప్రస్తుతం ఉన్న సెక్యూరిటీ వ్యవస్థలో ఏమైనా లోపాలు ఉంటే వాటిని సరిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అలారం, సెన్సార్లు సమర్థవంతంగా పనిచేయడం కోసం పరికరాలను సరికొత్తగా మార్చడం, సాంకేతికతను మెరుగుపరచడం వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపడతామని ఎస్‌పి తెలిపారు. బ్యాంకు అధికారులతో, సెక్యూరిటీ సిబ్బందితో సమన్వయం కుదుర్చుకుని, సెక్యూరిటీ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజలందరినీ అప్ర మత్తంగా ఉండాలని, ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా వెంటనే సంబంధిత పోలీసు లకు, డయల్ 100/112 లేదా పోలీస్ వాట్సాప్ నెంబర్ 9440900005 కు సమాచారం అందించా లని ఎస్‌పి పేర్కొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి-గూడూరు టౌన్: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ఆ క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోనే గమల్లపాలెంలోని వృద్ధాశ్రమంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నాగ వెంకట శివ కుమార్ దాతృత్వంతో వృద్ధులకు ఛాయిస్ ఫుడ్ అనే కార్యక్రమాన్ని నిర్వహించి, వారు కోరుకున్న భోజనాన్ని అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు బివి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ. రోటరీ క్లబ్ ద్వారా పట్టణంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, అందులో భాగంగానే వృద్ధాశ్రమంలో ఛాయిస్ ఫుడ్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించే వారికి కోరుకున్న ఆహారాన్ని అందించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో రొటేరియన్లు దశరథ రామిరెడ్డి, మునిగిరిష్, మయూరి శ్యామ్, మల్లయ్య, రాంప్రసాద్, బలరామిరెడ్డి పాల్గొన్నారు.

ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని ఓం శ్రీ సాయి రాం వృద్ధాశ్రమంలో ఆదివారం వివేకానంద కోచింగ్ సెంటర్ విద్యార్థిని మౌనిష జన్మదినం సందర్భంగా మూడు ఫ్యాన్లను అందజేశారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధులకు పంచి పెట్టారు. ఆమె మాట్లాడుతూ వృద్ధాశ్రమంలో తన జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున్, ఆశ్రమ నిర్వాహకురాలు కళ్యాణి తదితరులు ఉన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని వన్ టౌన్ సిఐ నరసింహారావు సూచించారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు స్థానిక సూపర్ బజార్ సర్కిల్ వద్ద వన్ టౌన్ పోలీసులు ఆదివారం హెల్మెట్ వాడకంపై ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత అవసరాల కోసం ద్విచక్ర వాహనాలను ఎలా వినియోగిస్తున్నామో, అదే తరహాలో హెల్మెట్ను కూడా తప్పనిసరిగా వాడటం అలవాటు చేసుకుంటే అనుకోకుండా సంభవించే రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని తెలిపారు. హెల్మెట్ వాడకంపై రాష్ట్ర హైకోర్టు కఠిన నిబంధనలు అమలు చేసిన నేపథ్యంలో వాహనదారులు హెల్మెట్ లేకుండా పట్టుబడితే మొదటిసారి జరిమానా, రెండోసారి కేసు నమోదు చేసి రిమాండ్కు తరలిస్తారని హెచ్చరించారు. ట్రాఫిక్ ఏఎస్ఐ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

'దౌర్జన్య పాలనకు విముక్తి'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి విజయం సాధించడంతో నియోజవర్గంలో వైసిపి దౌర్జన్యాల పాలనకు విముక్తి లభించిందని బొజ్జల రిషిత రెడ్డి, బొజ్జల బృందమ్మ అన్నారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి స్వగ్రామం అమ్మపాలెం నుంచి కొందరు మహిళలు ఆదివారం బొజ్జల రిషితా రెడ్డిని, బృందమ్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో గెలుపు సాధించడం పట్ల శుభాకాంక్షలు తెలిపారు. సుధీర్ రెడ్డి పాలనలో గోపాలకృష్ణారెడ్డి పాలనను గుర్తుకు తెస్తారని ఆకాంక్షిస్తున్నట్లు వారు చెప్పారు. జ్యోష్న తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్ను సద్వినియోగం చేసుకోవాలి

- డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరయ్య

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరు ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రతి ఏటా నిర్వహిస్తున్న క్యాంపస్ డ్రైవ్ను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరయ్య సూచించారు. క్యాంపస్ డ్రైవ్ ద్వారా అనేకమంది విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలకు ఎంపికై అవుతున్నారని చెప్పారు. తద్వారా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. అందువల్ల ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వివరాలకు 9182136920, 8374556441, 8142538870లను సంప్రదించాలన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: రహస్యంగా పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వెంకట నరసింహులు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ఎన్టీఆర్ నగర్ సమీపంలోని వంట పొలాల్లోని గెస్ట్ హౌస్ వద్ద పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారంతో దాడులు చేపట్టామన్నారు. వరదయ్యపాళ్యం మండలంకు చెందిన నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారి వద్ద నుంచి రూ.52వేల నగదు, నాలుగు సెల్ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతి ప్రదానం

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలం మనసముద్రం యూత్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్లో దాదాపుగా 30జట్లు పాల్గొనడం జరిగింది. తదుపరి జట్టు తలపడగా చివరికి మంగళం వర్సెస్ మన సముద్రం ఫైనల్కి చేరాయి. వీటిలో మంగళం జట్టు విజేతగా నిలిచి రూ.10వేలు బహుమతిని, మనసముద్రం జట్టు రన్నర్గా నిలిచి రూ.7వేలను బహుమతిగా అందుకున్నాయి. దీనితో ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ ఎం.చంద్రయ, ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ టి.అజిత్కు ఇవ్వడం జరిగింది. మనసముద్రం టిడిపి సీనియర్ లీడర్ బొజ్జల రోశ రెడ్డి చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు.

బిజెకెపి రాష్ట్ర కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): భారతీయ జనా కిసాన్ పార్టీ రాష్ట్ర కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్లో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షులుగా కొండ రాజేశ్వరావు, ఉపాధ్యక్షులుగా దగ్గిరెడ్డి నరసింహ రెడ్డి, కార్యదర్శిగా శివప్రసాద్ కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్గా కిషోర్ కుమార్, కువ్వ స్వామి, శ్రావణ్కుమార్, పాండురంగారావు, లీగల్ అడ్వైజర్గా రమేష్కుమార్ ప్రమాణస్వీకారం చేశారు.



ఇక బిల్లుల చెల్లింపు యాప్, వెబ్సైట్లలో మాత్రమే

ప్రజాశక్తి-డక్కిలి: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) విద్యుత్తు బిల్లులను యూపీఐ మాధ్యమాలైన గూగుల్ పే, ఫోన్ పే, అమెజాన్, పేటీఎంల నుంచి చెల్లింపులను నిలిపివేస్తూ తీసుకున్న నిర్ణయం వినియోగదారులకు ఇబ్బందిగా మారనుంది. ఆర్బీఐ విద్యుత్తు సంస్థ యాప్, ఆన్లైన్లో చెల్లించడానికి అవకాశం కల్పించింది. ఇన్నాళ్లు యూపీఐ యాప్లతో అలవాటు పడిన వినియోగదారులు కొత్త వేదికలో చెల్లించడం కొంత అసౌకర్యానికి గురికానున్నారు. విద్యుత్తు సంస్థ కొంతకాలంగా డిజిటల్ పేమేంట్లను ప్రోత్సహించింది. ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు బిల్లులు చెల్లించడానికి ఈ విధానంపై అవగాహన కల్పించారు. యూపీఐ మాధ్యమాల్లో చెల్లింపులను వారికి వివరించడంతో వినియోగదారులు సులభ విధానమని భావించారు. విద్యుత్తు సంస్థకు చెల్లింపులో అధిక శాతం యూపీఐ పేమెంట్ల ద్వారా చెల్లిస్తున్నారంటే ప్రజల్లో ఎంత ఆదరణ వచ్చిందో అర్థమవుతుంది. ఇకపై విద్యుత్తు సంస్థ యాప్, ఆన్లైన్లో చెల్లించడానికి అవకాశం కల్పించినా, వినియోగదారులకు అవగాహన వచ్చే సరికి సమయంపట్టొచ్చు. అప్పటివరకు విద్యుత్తు బిల్లుల వసూలు కేంద్రాలను ఆశ్రయించే అవకాశముంది. ముఖ్యంగా పట్టణాల్లో విద్యుత్తు వినియోగదారుల్లో ఎక్కువ శాతం మంది డిజిటల్ చెల్లింపులే చేస్తున్నారు. ఇలా చెల్లించాలి.. గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఏపీఎస్పీడీసీఎల్ మొబైల్ యాప్ను డౌన్ లోడ్ చేసుకోవాలి. లేదా ఏపీ ఎస్పీడీసీఎల్ వెబ్సైట్ ఓపెన్ చేసి బిల్ డెస్క్ పై క్లిక్ చేయగానే సర్వీస్ నెంబర్ ఎంటర్ చేసి, అక్కడున్న కెప్చా ఎంటర్ చేసి సబ్మిట్ కొట్టాలి. అప్పుడు వినియోగదారు నీ పేరు, బిల్లు కనిపిస్తుంది. అక్కడ మళ్లీ సబ్మిట్ కొట్టాలి. బిల్లుల చెల్లించేక్రమంలో గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం, అమెజాన్ తదితర యూపీఐ ప్రొవైడర్లను వాడే అవకాశం మాత్రం కల్పించారు. ఈవిధానం పై అవగాహన లేనివారు బిల్లు చెల్లింపు కేంద్రాలకు వెళ్లాల్సి ఉంటుందనీ ట్రాన్స్ కో అధికారులు చెబుతున్నారు.

ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: గిరిజన బాధితులను అన్ని విధాలా ఆదుకుంటాం అని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. ఇటీవల షార్ట్ సర్క్యూట్తో పూర్తిగా ఇల్లు దగ్ధమైన గిరిజనులను ఆదివారం ఎమ్మెల్యే పరామర్శించారు. ఇందులో భాగంగా పాండూరు పంచాయతీ వేంకటేశ్వర గిరిజనకాలనీలో పూరిల్లు దగ్ధమై నిరాశ్రయులైన బుజ్జమ్మ కుటుంబానికి ఎమ్మెల్యే రూ.పది వేలు ఆర్థిక సాయం అందించారు. అదేవిధంగా ఇందిరానగర్లో పూరిల్లు దగ్ధమైన స్వప్న కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వ పరంగా అన్నివిధాలా



ఆదుకుంటామని ఎమ్మెల్యే వారికి భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ద్వారా బియ్యం పంపిణీ చేశారు. అదేవిధంగా గిరిజనకాలనీ ఎస్సీ కాలనీల్లో రోడ్లు తాగునీరు కరెంట్ సమస్యలని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఉదయ భారతి, యుగంధర్ రెడ్డి, చిరంజీవి యాదవ్ పాల్గొన్నారు.

ఎంఆర్పీఎస్ జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: ఎంఆర్పీఎస్ ప్రయాణంలో ఎన్నో ఉద్యమాలను ఆటంకాలు ఎదుర్కొని 30వసంతాలు పూర్తి చేసుకున్నదని ఎంఆర్పీఎస్ సీనియర్ నాయకులు పల్లిపాక నాగరాజు అన్నారు. మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం ఎంఆర్పీఎస్ 30సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా యర్రావారిపాళ్యం మండలంలోని కూరపర్తివారిపల్లిలో ఆదివారం ఎంఆర్పీఎస్ జెండా ఆవిష్కరణ చేసి కేక్ కట్ చేశారు. బడుగు బలహీన వర్గాలకు, సమసమాజ స్థాపనకు, వికలాంగులకు పెన్షన్లు, చేస్తామని కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నడకతో రక్త పోటు నివారణ



- డాక్టర్ నాగజ్యోతి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: నడకతో మధుమేహం, రక్త పోటు నివారించుకోవచ్చునని తిరుపతి కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ నాగజ్యోతి పేర్కొన్నారు. పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ ఆదివారం అసోసియేషన్ అధ్యక్షులు కేఎల్ మూర్తి, వ్యవస్థాపకులు డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ రవిరాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ నాగజ్యోతి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మధుమేహం బిపి ఉన్న వారు తప్పనిసరిగా కిడ్నీ పరీక్షలు చేసుకుంటే చాలావరకు ఉపయోగమన్నారు. మధుమేహం రెండు, టైప్ టు టైప్ చిన్నపిల్లలకు వస్తాయని, పెద్దవారికి టైప్ వన్ మధుమేహం వస్తాయని, ఆహారపు అలవాట్లు వల్ల కూడా మధుమేహం వస్తాయని తెలిపారు. కుటుంబంలో ఎవరికైనా కిడ్నీ వ్యాధులు ఉన్న వారికి మరొకరికి కూడా వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. అనంతరం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కిడ్నీ వైద్య నిపుణులు నాగజ్యోతిని ఘనంగా సన్మానం చేసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వాకర్ అసోసియేషన్ కార్యదర్శి ముని కృష్ణయ్య, డాక్టర్ ఆరుముగం, ట్రెజరర్ గుణశేఖర్ రెడ్డి, ఉషోదయ వాకర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు కోనేటి రవిరాజు, గోపికృష్ణ, కుప్పయ్య శెట్టి, మాజీ అధ్యక్షులు రామచంద్ర నాయుడు, నరసింహారావు, వాకర్ సభ్యులు పాల్గొన్నారు.

దర్జాగా బస్సు షెల్టర్ కబ్జా

- టెంకాయలు వ్యాపారం తొలగించండి..
- మానవ హక్కుల సంఘం నాయకుల వినతి



ప్రజాశక్తి-పలమనేరు: దర్జాగా బస్సు షెల్టర్ను కబ్జా చేసి నిర్వహిస్తున్న టెంకాయల వ్యాపారాన్ని తొలగించాలని మానవ హక్కుల సంఘం నాయకులు కోరారు. పలమనేరు నియోజక వర్గం పలమనేరు పట్టణంలో జాతీయ మానవ హక్కుల నాయకుల కార్యాలయంలో జిల్లా మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ అధ్యక్షుడు డివి మునిరత్నం ఆదివారం మీడియాతో మాట్లాడుతూ పట్టణంలోని రంగబాబు సర్కిల్ వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు షెల్టర్ నిర్మించారని పట్టణ ప్రజలు బస్సు ఎక్కడానికి వీలుగా వర్షం వచ్చినా, ఎండ వచ్చినా అక్కడ కూర్చోవడానికి వర్షం వచ్చినా అక్కడ తలదాచుకోవడానికి అనువుగా ఉండేదని, గత కొన్ని సంవత్సరాలుగా బస్ షెల్టర్ని దర్జాగా కబ్జా చేసి కొబ్బరి కాయల వ్యాపారం నిర్వహించుకుంటున్నారన్నారు. ఆ కొబ్బరికాయలు అక్కడ వుండడం వల్ల అటు వైపు నుంచి వచ్చే వాహన దారులకు ఎద్దుల సంత నుండి రైట్టర్న్ తీసుకునే వారికి ఎదురుగా వస్తున్న వాహనాలు కనపడక ప్రమాదాలు చోటు చేసుకున్న సందర్భాలు అనేకం వున్నాయన్నారు. ప్రజల సౌకర్యార్థం మళ్లీ దాన్ని బస్ షెల్టర్గా ఏర్పాటు చేయాలని వెంటనే అక్కడ నుండి ఆ దుకాణాన్ని తొలగించాలని సంబంధించిన అధికారులను కోరారు.

చిత్తూరు పార్లమెంట్ సమగ్రాభివృద్ధే ధ్యేయం

- మ్యాంగో బోర్డు రూపకల్పనకు చర్యలు- ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు పార్లమెంటు సమగ్రాభివృద్దే ధ్యేయంగా తాను పనిచేస్తానని, ఆ దిశగా ఇప్పటికీ ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు సాగు తున్నామని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు తెలిపారు. ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాల కనుగుణంగా పని చేస్తూ ప్రభుత్వం పథకాలను ప్రజలకు చేరువ చేస్తానని చెప్పారు. అదే సమయంలో చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు సమన్వయముతో పనిచేసి, ప్రజల హృదయాలను గెలిచి పార్టీ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. పార్టీ కోసం పని చేసే నాయకులు, కార్యకర్తల సేవలను టిడిపి అధిష్టానం ఎప్పుడూ గుర్తించుకుని, వారిని గౌరవిస్తుందని తెలిపారు. టిడిపి కార్యా లయంలో చిత్తూరు పార్లమెంటు అధ్యక్షులు రాజన్ అధ్యక్షతన టిడిపి నాయ కులు, కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు ముఖ్య అతిథిగా హాజరై తెలుగు తమ్ముళ్లకు దిశా నిర్దేశం చేశారు. చిత్తూరు పార్లమెంట్ అభివృద్ధి కోసం తాను చేపట్టబోయే సంస్క రణలకు సంబంధించిన అంశాలను వివరించారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు సమర్థవంతమైన నాయకత్వాన్ని కోరి కూటమికి అధికారాన్ని కట్టబెట్టిన విషయాన్ని అందరూ గుర్తించాలన్నారు. ఈ నేపథ్యంలోనే తాను ఢిల్లీలో కేంద్ర మంత్రుల్ని కలిసి, చిత్తూరు పార్లమెంటు అభివృద్ధికి సంబంధించి సహాయ సహకారాలు అందించాలని కోరుతూ లేఖలను అందించినట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా అన్నదాతల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకొని, మామిడి రైతులకు చేయూత నివ్వాలని, జిల్లాలో మ్యాంగో బోర్డు రూపకల్పనకు సహరించాలని కోరినట్లు వివరించారు. జిల్లాలో విద్య , వైద్య రంగాలకు పెద్ద పీట వేయాలనే సంకల్పంతో జిల్లా కేంద్రంలో విశ్వవిద్యాలయ స్థాపనకు సహాయాన్ని అందించాలని విజ్ఞప్తి చేసినట్లు వివరిం చారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని ముఖ్య ఉద్దేశంతో ఎంఎస్ఎంఈల స్థాపనకు తోడ్పాటును అందిం చాలని విన్నవించినట్లు చిత్తూ రు ఎంపి తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేసి తద్వారా యువతకు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. పేదోడి ఇంటి కలను సహకారం చేసేందుకు టిడ్కో ఇళ్ల నిర్మాణానికి కేంద్రం ప్రభుత్వం అన్ని రకాల సహకరిస్తున్నట్లు చెప్పారు.

సోలార్ వినియోగం పెంపునకు కృషి

జిల్లాలో సోలార్ వినియోగాన్ని పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆయన వివరించారు. వెనుకబాటుతనం అనే పదాన్ని తీసేసి పేదలు లేని సమాజాన్ని స్థాపించేందుకు తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎంపి తెలిపారు. చిత్తూరు పార్లమెంటును ప్రగతి పథంలో నడిపించేందుకు తీసుకుంటున్న చొరవ ఎనలేనిది కొనియాడారు. తాను ఏ సహాయాన్ని కోరినా చంద్రబాబు అంగీకరించడం ఆయన సమర్థవంతమైన నాయకత్వానికి నిదర్శనం అన్నారు. ఈ సమావేశంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ , చిత్తూరు పార్లమెంటు జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్ , మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, కుప్పం నియోజకవర్గం టిడిపి ఇన్ఛార్జి మునిరత్నం నాయుడు ,మాజీ మేయర్ కటారి హేమలత, రాష్ట్ర అధికార ప్రతినిధులు సురేంద్ర కుమార్, అశోక్, రాధేయ్ కన్స్ట్రక్షన్స్ అధినేత, యువ నాయకులు రాధేయ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు అరుణ, రిటైర్డ్ ఎస్పీ చిన్నస్వామి పాల్గొన్నారు.

తెలుగు భాషా సంస్కృతులకు కృషి చేయాలి

- తెలుగు సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు తులసినాథంనాయుడు
- ఘనంగా కళామందిర్ ద్వితీయ వార్షికోత్సవం

ప్రజాశక్తి -గంగవరం: మండలంలోని సాయి గార్డెన్ సిటీ లోని కళామందిర్లో ఆదివారం కళామందిర్ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు తులసినాథం నాయుడు మాట్లాడుతూ తెలుగు భాషా సంస్కృతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అప్పుడే అవి సజీవంగా నిలబడుతారన్నారు. కళామందిర్ ఆధ్వర్యంలో గత రెండు సంవత్సరాలలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామని లక్షలాది మంది విద్యార్థులకు విద్యా సామగ్రి పుస్తకాలు రాష్ట్ర స్థాయిలో పంచామన్నారు కార్యదర్శి పుష్ప మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ తెలంగాణ తమిళనాడు కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వందలాది మంది భాష అభిమానులను సత్కరించి తెలుగు భాష పరిరక్షణకు తమ వంతు కృషి చేశామన్నారు. భాషా పోటీలలో పాల్గొన్న 20 మంది విద్యార్థులకు జ్ఞాపికలు ప్రశంస పత్రాలు పుస్తకాలు, బహుమతులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పలు రాష్ట్రాలకు చెందిన మేధావులు పండితులు రచయితలను ఘనంగా సత్కరించి పురస్కారాలు అందించి వారి సూచనలు సలహాలను



బహుమతులు పొందిన విద్యార్థులతో తులసినాథంనాయుడు

తెలుసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రచయితలు విద్యార్థులు కళామందిర్ సిబ్బంది పాల్గొన్నారు.

బుద్ధుని బోధనలు విశ్వమానవ వికాసానికి మార్గం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: బుద్ధుని బోధనలు విశ్వమానవ వికాసానికి మార్గం అని బుద్ధిస్ట్ గోవర్ధన్ పేర్కొన్నారు. మ్యాంగో భవన్లో గౌతమ బుద్ధుడు తొలి ప్రవచనం ఇచ్చిన సందర్భంగా ఈనాటి పరిస్థితులలో బౌద్ధం అవసరం అనే అంశంపై ముఖ్య ఉపన్యాసం డాక్టర్ వి కె మోహన్ అధ్యక్షతన నిర్వహించారు. కుటుంబం, సమాజం విచ్ఛిన్నానికి కారణమవుతాయని బుద్ధుడు తెలిపారని నాగరికత ధర్మాన్ని మనం పాటిస్తే సమాజం ధర్మం, మార్గం, సామ్యవాదం వైపు నడుస్తుందని బుద్ధుని బోధనలు ఆరోగ్య సమాజానికి, వ్యక్తిత్వ వికాసానికి విశ్వమానవ వికాసానికి ఉపయుక్తంగా ఉంటాయని అందుకు అందరం ఆ దిశగా ఆలోచించాలని , జీవించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్ కె రామలక్ష్మి , గౌరవ అతిథులుగా కట్టమంచి బాలకృష్ణారెడ్డి, శివ మోహన్ రెడ్డి, ప్రత్యేక అతిథులుగా తిరుపతి నుండి గుర్రప్ప విశ్రాంత జిల్లా జడ్జి , భాస్కర రావు మునిరత్నం , నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బుద్ధిస్ట్ గోవర్ధన్

అవినీతి చక్రవర్తికి ఇన్ఛార్జ్ వీసీగా అందలమా..?: ఏఐఎస్ఎఫ్

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: ఎస్వీయూ చరిత్రలో ఇన్ఛార్జ్ వీసీగా పని చేస్తూ అవినీతికి పాల్పడి అడ్డంగా దొరికిన ఆచార్య జానకి రామయ్యకు మరోసారి అదే పదవిలో కూర్చోబెట్టాలని కూటమి ప్రభుత్వం చూస్తున్నట్టు జరుగుతున్న ప్రచారంపై స్పందించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన పత్రికలతో ఆదివారం మాట్లాడుతూ దేశంలో ఎంతో ప్రతిష్ట కలిగిన యూనివర్సిటీలో 2019లో రెక్టర్గా పని చేసిన కాలంలో జానకి రామయ్య అనుబంధ బిఈడి, ఎమ్ఈడీ కాలేజీల నుంచి అక్రమ వసూళ్లు చేసినట్టు స్పష్టంగా ఆధారాలతో సహా ఏఐఎస్ఎఫ్ పోరాటం చేసిందని గుర్తు చేశారు. కారణంగా అప్పటి వీసి రాజేంద్ర ప్రసాద్ ఆదేశాలతో రెక్టర్ పదవికి రాజీనామా చేశారని గుర్తు చేశారు. అయనపై ఏఐఎస్ఎఫ్ అరోపణలు చేయలేదు అని అన్ని ఆధారాలు తమతో ఉన్నాయని, అవినీతికి పాల్పడినట్టు స్పష్టం చేసిన ఆడియో టేపులు మీడియా ముందే విడుదల చేసినట్టు గుర్తు చేశారు. ఇవేకాక అయనపై అనేక ఆరోపణలు కూడా ఉన్నాయని అటువంటి వ్యక్తుకి ఇన్ఛార్జ్ వీసిగా నియమిస్తే యూనివర్సిటీ పరువు బజారున పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన్ని ఇన్ఛార్జ్గా నియమిస్తే మరో పోరాటానికి శ్రీకారం చూడతామని స్పష్టం చేశారు.

పాడి రైతులకు పశుగ్రాసంపై అవగాహన



ప్రజాశక్తి-గూడూరు టౌన్: పాడి రైతులు గేదెలకు పోషక విలువలు కలిగిన పశుగ్రాసాన్ని అందించాలని గూడూరు పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు సురేష్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రాంతీయ పశు వైద్యశాలలో పశుగ్రాస వారోత్సవం సందర్భంగా పాడి రైతులకు పశుగ్రాసంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పచ్చిమేత లేనిదే పాడి ఎప్పుడు లాభ సాటి కాదన్నారు. నాణ్యమైన పశుగ్రాసాలను పండించి శాస్త్రి పద్ధతుల్లో పశువుల మేపినట్లయితే అధిక పాల ఉత్పత్తి సాధిస్తూ, పాల ఉత్పత్తి ఖర్చు తగ్గించవచ్చు అన్నారు. పశుగ్రాసాలు రుచికరంగా ఉండడం వల్ల పశువులు ఇష్టంగా తింటాయన్నారు. పశుగ్రాసాలతో మేపిన పశువులు ఆరోగ్యకరంగా ఉండి, వ్యాధి నిరోధక శక్తిని కలిగి ఉంటాయన్నారు. దీనివలన పశువులు వ్యాధులు బారిన పడవు అన్నారు. అనంతరం పసు గ్రాసాల్లోని రకాలను గురించి వివరించారు. కార్యక్రమంలో పాడి రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

ప్రజాశక్తి-డక్కిలి: మండల కేంద్రంలోని లక్ష్మిసాయి, వెంకటరమణ ఎరువుల దుకాణాలను విజిలెన్స్ అధికారులు ఆదివారం తనిఖీ చేపట్టారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేక తనిఖీ అధికారి ఎన్పి ఎల్లప్ప, విజిలెన్స్ అధికారి జీవానందం మాట్లాడుతూ కమిషనర్ ఆఫ్ అగ్రికల్చర్ ఆదేశాల మేరకు వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా వెంకటగిరి, సబడివిజన్ పరిధిలోని వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాలలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు దుకాణాలపై దాడులు చేసినట్లు చెప్పారు. తగిన అనుమతి పత్రాలు లేనందు వలన, ఫారం ఓను లైసెన్సులో నమోదు చేయనందున రూ.3,28,000 విలువగల ఎరువులు అమ్మకాలను నిలుపుదల చేశామన్నారు. రైతులకు మార్కెట్లో స్వేచ్ఛాయుత వాతావరణంలో, మంచి నాణ్యమైన అనుమతి గల ఎరువులు, పురుగు మందులు, విత్తనాలును మాత్రమే అమ్మాలని, ఎంఆర్పీ ధరలకు లోబడి మాత్రమే అమ్మాలన్నారు. ఎరువులను అక్రమంగా నిల్వచేయ కూడదని, ఎవరైనా నిబంధనలు అతిక్రమించి వ్యాపారం చేస్తే అట్టి వారి లైసెన్సులు రద్దు చేయడంతో పాటు కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వెంకటగిరి ఏడీఏయం నాగార్జునసాగర్, వ్యవసాయ అధికారులు ఈఎస్ వరప్రసాద్, శిరోష తదితరులు పాల్గొన్నరు.



హోం గార్డుపై చర్యలు తీసుకోవాలి

- డీఎస్పీ శ్రీనివాసరావుకు వినతి



డీఎస్పీకి వినతి పత్రం అందజేస్తున్న విలేకరులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: విధి నిర్వహణలో భాగంగా మీడియా రిపోర్టర్స్ శనివారం మధ్యాహ్నం ఫోటో, వీడియో తీస్తుండగా వారి పట్ల దురుసుగా ప్రవర్తించిన హోం గార్డ్ జయకుమారిపై చర్యలు తీసుకోవాలని డీఎస్పీ శ్రీనివాసరావుకు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు వినతి పత్రం అందజేశారు. స్పందించిన డీఎస్పీ శ్రీనివాసరావు హోంగార్డును మందలించి, ఇకపై ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూస్తామని మీడియా మిత్రులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సుమంత్, లోకేష్, అభి, సురేష్ బాబు, హేమనాథ్, గుణశేఖర్, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

'జె టౌన్ ఆక్రమణలు తొలగించండి..'

ప్రజాశక్తి -పుంగనూరు: పుంగనూరు పట్టణ బైపాస్ రోడ్డు పక్కన ఇటీవల మాజీ ఎమ్మెల్యే వేసిన వెంచర్ తీగలమ్మ చెరువు మరవను సైతం కబ్జా చేసి దురాక్రమణ చేయడం దుర్మార్గమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ రామానాయుడు, చిత్తూరు జిల్లా సహాయ కార్యదర్శి డాక్టరు టి జనార్ధన్ లు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం ఆక్రమణలు జరిగిన వెంచర్ను , తీగలమ్మ చెరువు మరవ దురాక్రమణ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో ఇలాంటి దురా క్రమణలు పెద్ద ఎత్తున జరిగిన ఉదంతాలు రోజు కొకటి బయటికి వస్తున్నాయని, అధికారులు పూర్తి అప్రమత్తంతో చెరువులు, కుంటలు, దేవాదాయ భూముల ఆక్రమణలను వెలికి తీసి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని పేర్కొన్నారు. తీగల కుంట మరవ కబ్జా చేయడం వల్ల వర్షపు నీరు పట్టణంలోకి ప్రవేశించి జలమయమయ్యే ప్రమాదం ఉందని వారు పేర్కొన్నారు . ఆర్ అండ్ బి రోడ్డును సైతం కబ్జా చేయడం దారుణమని అధికారులు తక్షణం కబ్జానుండి కాపాడాలని తెలిపారు. భీమగాన పల్లి చెరువులో 18 ఎకరాలు, సుగాలి మిట్ట వద్ద 5 ఎకరాలు పేదల భూములు కబ్జా అయ్యాయని వెంటనే వాటికి విముక్తి కల్పించి వాటిని పేదలకు దక్కేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. నూతన ప్రభుత్వం కబ్జాలను వెంటనే స్వాధీన పరుచుకుని తగు చర్యలు తీసుకోవాలని లేకుంటే ఉద్యమానికి సన్నద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కె. రామ్మూర్తి, జి.గురవయ్య, మోహన్ పాల్గొన్నారు.

ఘనంగా ఎంఆర్పిఎస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి -సోమల: ఎంఆర్పిఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను మండలంలోని ఎంఆర్పిఎస్ నాయకులు కార్యకర్తలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన సోమల జయంతి కాలనీ వద్ద, కందూరు గ్రామం మిట్టపల్లి హరిజనవాడ వద్ద ఎమ్మార్పీఎస్ జెండాను ఎగరవేసి కేక్ కట్ చేసి స్వీట్లు పేదలకు పంచిపెట్టారు. అలుపెరుగని పోరాటయోధుడు ఏబిసిడి కోసం నిరంతర పోరాటం చేస్తున్న మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, ఇదే రోజు ఎంఆర్పిఎస్ వ్యవస్థాపక దినోత్సవంగా జరుపుకోవడం మాదిగలకు గర్వంగా ఉందని పలువురు ఎంఆర్పిఎస్ నేతలు అన్నారు. ఈ కార్యక్రమంలో మాటూరి మురళి, మంద రామనాథం, శుభకర్, మొగిలి ఈశ్వరయ్య, ప్రభు కుమార్, వెంకటరామయ్య దళిత మహిళలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘనస్వాగతం

ప్రజాశక్తి-పూతలపట్టు: పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ కు ఆయన సొంత గ్రామంలో ఘన స్వాగతం లభించింది. పూతలపట్టు మండలం గొడుగుచింత మొరవ హరిజనవాడలో ఆదివారం నిర్వహించిన సీమంతం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ముందు తన స్వగ్రామం గొడుగుచింతకు చేరుకోవడంతో భారీగా బాణాసంచా పేల్చి, డప్పులతో గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. పుష్పాలు వెదజల్లుతూ దుశ్శాలువ, గజమాలతో సత్కరించి గ్రామంలోని ఆహ్వానించారు. సమీప బంధువు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. సమీప బంధువులు కావడంతో సీమంత వేడుకలలో బంధువులను, స్నేహితులను ఆప్యాయంగా పలకరిస్తూ, సుమారు గంట పాటు సంతోషంగా గడిపారు.

ఘనంగా కిషన్చంద్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: జీడి నెల్లూరు తెలుగు యువత అధ్యక్షుడు గురుసాల కిషన్ చంద్ పుట్టినరోజు సందర్భంగా మండలంలో తెలుగు తమ్ముళ్లు అభిమానులు ఆదివారం ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. గొడుగు చింత పంచాయతీ, చవనపల్లి గ్రామంలో ఆలయ నిర్మాణానికి విరాళం అందించారు. అనంతరం గ్రామస్తులు కేక్ కట్ చేశారు. తెలుగు తమ్ముళ్లు సంబరాలు చేసుకున్నారు. మధ్యాహ్నం బ్రాహ్మణపల్లి పంచాయతీ సర్పంచ్ శిరీష చాణిక్య ప్రతాప్ ఆధ్వర్యంలో ఆ పంచాయతీ పరిధిలో, మండల కేంద్రంలో అన్నదానం నిర్వహించారు. గంటావారి పల్లిలో సర్పంచ్ శ్రీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ చేపట్టారు. పచ్చికాపలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తెలుగు తమ్ముళ్లు, అభిమానులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ సురేఖ తమ సిబ్బందితో హాజరయ్యారు. రోగులకు పండ్లు పంచి పెట్టారు.

శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ఎన్టీఆర్ ఆరోగ్య వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చినట్టు సర్పంచ్ ద్రాక్షాయిని అన్నారు. ఆదివారం బంగారుపాలెం మండలం గుంతూరు పంచాయతీలో బెంగళూరుకు చెందిన వైదేహి కార్పొరేట్ ఆసుపత్రి వారు వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చినట్టు తెలిపారు. దాదాపు 400 మంది వైద్య పరీక్షలు చేసుకోగా వారికి తగిన వైద్యం అందించారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య విభాగ అధ్యక్షులు వంశీ చౌదరి, వైదేహి పిఆర్ఓ లోకేష్ భరణి, సోమ పలువురు వైద్యులు పాల్గొన్నారు.